
# సత్యవాక్యము

# THE WORD OF TRUTH



## క్రైస్తవ మాసపత్రిక

**MARCH - 2008**

సంవత్సర చందా రూ. 50/-

# ఏషియన్ బైబిలు లెక్చర్‌షిప్

## Asian Bible Lectureship
## at Kakinada

**తేదీలు** : 2008 నవంబరు 30వ తేదీ నుండి
డిశంబరు 4వ తేదీ వరకు

**సమయం** : ప్రతిరోజు ఉదయం 10:00 గంటలకు
మధ్యాహ్నం 3:00 గంటలకు
సాయంత్రం 6:00 గంటలకు

**స్థలం** : అంబేద్కర్ భవన్
పాత బస్ స్టాండు
**కాకినాడ**

ఏషియన్ బైబిలు లెక్చర్‌షిప్‌లో ఆసియాలోని పలుదేశాలలో సువార్త చాటుచున్న గొప్ప బోధకులు, స్వదేశీ బోధకులు ఉపన్యసించెదరు. బైబిలులోని ప్రాముఖ్యాంశములను తెలిసికొనుటకు మీకు ఇదే మంచి తరుణము. ఆ సభలో పాల్గొనుటకు మీరు మీ సంఘము ఇప్పటి నుండే సిద్ధపడండి.

Cell : 92474-56270
0884-2363722

వందనములతో
**రిక్కీ గూటంగారు**
**జాషువా గూటంగారు**

# సత్యవాక్కు

# THE WORD OF TRUTH

P.O.Box - 80, Kakinada, A.P. 533 001
Ph : 0884 - 2363722

Editor :
Joshua Gootam

*Pleading for Restoration of First Century Christianity*

సంపుటి 28 | మార్చి 2008 | సంచిక 8


## పాపము

(Sin)

మనలో చాలమంది ప్రతిరోజు వార్తాప్రతికలు చదివే అలవాటును కలిగియున్నాము. వార్తాపత్రికలను చదివేకొలదీ మనకేమి కన్పడుచున్నది? దొంగతనములు, దోపిడీలు, నరహత్యలు, అపహరణలు రోజు రోజుకూ పెరిగిపోవుచున్నవి. ఈ లోకం అంతా గందారగోళంతో నిండి యున్నట్లున్నది. దానినే మనం పాపం అని కూడా చెప్పుకోవచ్చును. "లోకమంతయు దుష్టుని యందున్నదని" భక్తుడైన యోహాను వ్రాసాడు (1యోహాను 5:19). పాపము సార్వజనికమైనది. ఏ భేదమునులేదు అందరును పాపము చేసి దేవుడనుగ్రహించు మహిమను పొందలేక పోవుచున్నారు (రోమా 3:23). "మనము పాపములేని వారమని చెప్పుకొనిన యెడల మనలను మనమే మోసపుచ్చుకొందుము; మరియు మనలో సత్యముండదు.... మనము పాపము చేయులేదని చెప్పుకొనిన యెడల,

ఆయనను అబద్ధికునిగా చేయువారమగుదుము; మరియు ఆయన వాక్యము మనలో ఉండదు" (1యోహాను 1:8,10).

పాపము ఎంత ఘోరమైనదంటే దేవుడు దానిని అసహ్యించుకొంటాడు. సృష్టికర్తయైన దేవునికి వ్యతిరేకముగా చేయు నేరమే పాపము. పాపము యొక్క పరిహారాన్ని మనం పొందకపోతే నరకాగ్నిలో నశింతుము (ప్రక 21:8). అయితే దేవుడు ప్రేమయై యున్నాడు (1యోహాను 4:8). గనుక మనలో ఎవడును నశింపవలెనని యిచ్ఛయింపక అందరు మారుమనస్సు పొందవలెనని కోరుచున్నాడు (2 పేతురు 3:9).

మరల, "పాపము చేయు ప్రతివాడును ఆజ్ఞను అతిక్రమించును; ఆజ్ఞాతిక్రమమే పాపము" (1యోహాను 3:4). అతిక్రమించడం అంటే హద్దు మీరిపోవడం అని యర్థం. "క్రీస్తు బోధ యందు నిలిచియుండక దానిని విడిచి ముందుకుసాగు ప్రతివాడును దేవుని అంగీకరింపనివాడు" (2 యోహాను :9). క్రీస్తు బోధను అతిక్రమించడం పాపము. హద్దు మీరడమే కాకుండా మనం చేయవలసినది చేయకపోవడం కూడా పాపమే. "కాబట్టి మేలైనది చేయనెరిగియు ఆలాగు చేయని వానికి పాపము కలుగును" (యాకోబు 4:17). అందువలన సకల దుర్నీతియు పాపము (1 యోహాను 5:17). దేవుని ఆజ్ఞలన్నియు నీతి గనుక (కీర్తన 199:172), ఆయన ఆజ్ఞలను బట్టి నడువనివాడు దుర్నీతిలో యున్న వాడవుతాడు. "మనమందరము గొఱ్ఱెలవలె త్రోవ తప్పిపోతిమి. మనలో ప్రతివాడును తన కిష్టమైన త్రోవకు తొలిగెను. యెహోవా మనందరి దోషమును అతని మీద (క్రీస్తుమీద) మోపెను" అని యెషయా చెప్పాడు (యెషయా 53:6). ప్రతివాడు దేవుని మార్గములో నడుచుటకు ఎంచుకొనక తన కిష్టమైన త్రోవకు తొలగిపోవుట ఇక్కడ గమనించాలి.

కొందరు దేవుని చిత్తాన్ని జరిగించుటకు గురిపెట్టరు. నిజానికి వారు దేవునికి లోబడినా, లోబడకపోయినా వరవాలేదను కొంటారు. తమ యిష్టం వచ్చినట్లు

జీవించాలని ఎంచుకొంటారు. వీటిని గూర్చి ఒకసారి ఆలోచించు. మనం చేయువలసినది చేయకపోయినా, చేయకూడనిది చేసినా, దేవుని చిత్తాన్ని పూర్తిగా నిర్లక్ష్యముచేసినా పాపమే. మనం చేసే దానిని బట్టి, చేప్పే దానిని బట్టి, ఆలోచించే దానినిబట్టి కూడా పాపము చేయగలము. ఏలయనగా, ''దురాలోచనలు, నరహత్యలు, వ్యభిచారము వేశ్యాగమనములు, దొంగతనములు అబద్ధ సాక్ష్యములు దేవదూషణలు హృదయములో నుండియే వచ్చును. ఇవే మనుష్యుని అపవిత్ర పరచును" అని యేసుప్రభువు చెప్పారు (మత్తయి 15:19).

ఈ సత్యములను నీకునీవే ఆలోచించుకో; నీవు చేయవలసినది చేయకుండా ఎప్పుడైనా యున్నావా? నీవు చెప్పకూడని మాటలు ఎప్పుడైనా చెప్పావా? చేయకుడనిది చేసావా? దేవుని చిత్తానికి సరిపడని తలంపులు తలంచావా? ఇంకోమాటలో నీవుపాపం చేసావని అంగీకరించగలవా? ఇందులో అనుమానం యేమీలేదు. మనందరం ఏదోరీతిగా పాపము చేసిన వారమే. మనందరకీ రక్షకుడు అవుసరమే.

అపవాది మనందరినీ "శరీరాశ, నేత్రాశ, జీవపుడంబములు" ద్వారా పాపములో పడేటట్టు శోధించుచునే యుంటాడు. "దురాశగర్భము ధరించి పాపమును కనగా పాపము పరిపక్వమై మరణమును కనును" (యాకోబు 1:15). "పాపము వలన వచ్చుజీతము మరణము'' (రోమా 6:23). మరణమనగా ఎడబాటు అని యర్థము. శరీరము నుండి ప్రాణము వేరైనప్పుడు భౌతిక మరణము సంభవించును (యాకోబు 2:26). మానవుడు దేవుని నుండి వేరైపోవుట ఆత్మీయమరణము. పాపము వలన ఈ రెండు మరణములు సంభవించును. ఆదాము హవ్వల పాప పర్యవసానముగా మనందరం శారీరకంగా మరణించు చున్నాము. గాని మన స్వకీయ పాపము వలన మన ఆత్మ దేవుని నుండి వేరైపోయే ప్రమాదమున్నది. ''రక్షింపనేరక యుండునట్లు యెహోవా హస్తము కురుచకాలేదు. విననేరక యుండునట్లు ఆయన చెవులు మందము కాలేదు. మీ దోషములు మీకును మీ దేవునికిని అడ్డముగా వచ్చెను. మీ పాపములు

ఆయన ముఖమును మీకు మరుగుపరచెను" అని దేవుని వాక్యము చెప్పుచున్నది (యెషయా 59:1-2). యేసుక్రీస్తు ద్వారా మన పాపములకు పరిహారము పొందక పోయినట్లయితే మనకు నిత్యనాశనము తథ్యము. ఎవరైతే "క్రీస్తు సువార్తకు లోబడరో అట్టివారు ఆయన సముఖము నుండియు, ఆయన ప్రభావమందలి మహిమనుండియు పొరదోలబడి నిత్యనాశనమను దండన పొందుదురు" (2 థెస్స 1:9).

మన జీవితములో యున్నపాపము వలన మనకు ఆత్మీయ మరణం సంభవించును. అపరాధముల చేత, పాపములచేత మనం చచ్చినవారముగా యుంటాము (ఎఫెసీ 2:1). అవి నిర్మూలించబడక పోతే నిత్యనాశనము లోనికి పోతాము. మనము యేసుప్రభువు నందు విశ్వసించకపోతే, పాపముల విషయమై మారుమనస్సు పొందకపోతే, పాపములలోనే మరణించితే రక్షింపబడ లేము. యేసుప్రభువు "నేను ఆయనవని (అనగా దేవుని కుమారుడనని) మీరు విశ్వసించని యెడల మీరు మీ పాపములోనే యుండి చనిపోవుదురని" చెప్పారు (యోహాను 8:24). మరల "మీరు మారుమనస్సు పొందని యెడల మీరందరును అలాగే నశింతురని" ఆయన చెప్పారు (లూకా 13:3,5).

అయితే "దేవుడు మనయెడల తన ప్రేమను వెల్లడి పరచుచున్నాడు; ఎట్లనగా మనమింకను పాపులమై యుండగా క్రీస్తు మనకొరకు చనిపోయెను. కాబట్టి ఆయన రక్తము వలన ఇప్పుడు నీతిమంతులముగా తీర్చబడి, మరింత నిశ్చయముగా ఆయన ద్వారా ఉగ్రత నుండి రక్షింపబడుదుము. ఏలయనగా శత్రువులమై యుండగా, ఆయన కుమారుని మరణము ద్వారా మనము దేవునితో సమాధానపరచబడిన యెడల, సమాధాన పరచబడిన వారమై ఆయన జీవించుట చేత మరి నిశ్చయముగా రక్షింపబడుదుము" (రోమా 5:8-10).

దేవుడు మనయెడల తన కృపను చూపుచున్నాడు. మనందరినీ ప్రేమించుచున్నాడు. అందరూ రక్షింపబడాలని కోరుచున్నారు. "దేవుడు లోకమునెంతో ప్రేమించెను. కాగా

ఆయన తన అద్వితీయ కుమారునిగా పుట్టిన వానియందు విశ్వాసముంచు ప్రతివాడును నశింపక నిత్యజీవము పొందునట్లు ఆయనను అనుగ్రహించెను" (యోహాను 3:16).

మనము నిత్యశిక్షను తప్పించుకొని నిత్యజీవములో ప్రవేశించాలంటే యేసుక్రీస్తు ఒక్కడే మార్గము. ఆయన తన పవిత్ర రక్తాన్ని సిలువపై చిందించి మన పాపముల కొరకు తన్నుతాను బలియాగముగా చేసికొని మనకు రక్షణ మార్గాన్ని తెరిచారు. అందుకే నేనే మార్గమును సత్యమును జీవమును, నా ద్వారానే తప్ప యెవడును తండ్రి యొద్దకు రాడు అని ఆయన చెప్పారు (యోహాను 14:6).

పాపముల నుండి రక్షింపబడాలంటే యేసుప్రభువు నందు విశ్వాసముంచాలి. ఆయన దేవుడు కుమారుడు. "కుమారుని యందు విశ్వాసముంచు వాడే నిత్యజీవము గలవాడు. కుమారునికి విధేయుడు కానివాడు జీవము చూడడు గాని దేవుని ఉగ్రతవాని మీద నిలిచి యుండును" (యోహాను 3:36). మన పాపముల విషయమై మారుమనస్సు పొందవలెనని ఆయన మనుష్యులకు ఆజ్ఞాపించుచున్నాడు (అపో.కా. 17:30). యేసుప్రభువు నందున్న విశ్వాసాన్ని మనుష్యుల యెదుట ఒప్పుకొనాలి. "ఏలయనగా నీతికలుగునట్లు మనుష్యుడు హృదయములో విశ్వసించును, రక్షణ కలుగునట్లు నోటితో ఒప్పుకొనును" (రోమా 10:9-10). మరియు పాపక్షమాపణ నిమిత్తము బాప్తిస్మము పొందాలి (అపో.కా. 2:38). ఏలయనగా "నమ్మి బాప్తిస్మము పొందినవాడు రక్షింపబడును, నమ్మని వానికి శిక్ష విధింపబడును" (మార్కు 16:16). నీ పాపముల నుండి రక్షింపబడ గోరుచున్నావా?

# సంఘ సహవాసము
# (Fellowship of the Church)

సహవాసము అనగా స్నేహము, సుహృద్భావము, సహకారము, అంగీకారము, పంచుకొనుట, సహాయము చేయుట, కలిసి పనిచేయుట, ఏకీభవించి యుండుట, ఒకే విశ్వాసమునకు చెందియుండుట మొదలగునవి. సంఘములోనికి సంఘము ఎవరిని అంగీకరించునో మరియు ఎవరిని అంగీకరించక యుండునో యనునవి సంఘమునకు వర్తించును.

క్రైస్తవులుగను, క్రీస్తు సంఘముగను యున్న మనము ఈ లోకముతోను, అందున్న అన్ని రకములైన మతస్థులతోను సహవాసము కలిగి యుండగలమా? యితర మతస్థులను అంగీకరించగలమా? వారితో కలసి ఆరాధించగలమా? వారిని ప్రోత్సహించగలమా? అట్లు చేయలేముగదా? ఇంకను విపులముగ చెప్పుకొనవలెనంటె ఈ దిగువ నుదహరించిన వారితో మనము సహవాసము చేయరాదు :

**1. దయ్యములకు బలి అర్పించువారితో మనము సహవాసము చేయరాదు.** "అన్యజనులర్పించు బలులు దేవునికి కాదు. దయ్యములకే అర్పించుచున్నారని చెప్పుచున్నాను. మీరు దయ్యములతో పాలివారగుట నా కిష్టము లేదు" (1 కొరింథి 10:20).

**2. అవిశ్వాసులతో మనము సహవాసము కలిగియుండరాదు.** "మీరు అవిశ్వాసులతో విజోడుగా ఉండకుడి, నీతికి దుర్నీతితో ఏమి సాంగత్యము? వెలుగునకు చీకటితో ఏమి పొత్తు? క్రీస్తునకు బెలియాలుతో ఏమి సంబంధము? అవిశ్వాసితో విశ్వాసికి పాలెక్కడిది? దేవుని ఆలయమునకు విగ్రహములతో ఏమి పొందిక? మనము జీవముగల దేవుని ఆలయమై యున్నాము; అందుకు దేవుడీలాగు సెలవిచ్చుచున్నాడు: "నేను వారితో నివసించి సంచరింతును, నేను వారి దేవుడనై యుందును. వారు నా ప్రజలై యుందురు. కావున మీరు వారి మధ్యనుండి బయలువెడలి ప్రత్యేకముగా ఉండుడి; అపవిత్రమైనదానిని ముట్టకుడని ప్రభువు చెప్పుచున్నాడు.

మరియు నేను మిమ్మును చేర్చుకొందును. మీకు తండ్రినై యుందును, మీరు నాకు కుమారులును కుమార్తెలునై యుందురని సర్వశక్తిగల ప్రభువు చెప్పుచున్నాడు" (2 కొరింథి 6:14:18).

**3. నిష్ఫలమైన అంధకార క్రియలలో మనము పాలివారమై యుండరాదు.** "నిష్ఫలమైన అంధకార క్రియలలో పాలివారై యుండక వాటిని ఖండించుడి" (ఎఫెసీ 5:11). "ఈ లోకమునైనను, లోకములో ఉన్నవాటి నైనను ప్రేమింపకుడి, ఎవడైనను లోకమును ప్రేమించిన యెడల తండ్రి ప్రేమ వానిలో నుండదు" (1 యోహాను 2:15). "వ్యభిచారిణులారా, యీ లోక స్నేహము దేవునితో వైరమని మీరెరుగరా? కాబట్టి యెవడు ఈ లోకముతో స్నేహము చేయగోరునో వాడు దేవునికి శత్రువగును" (యాకోబు 4:4).

**4. అబద్ధ బోధకులతో మనము సహవాసము కలిగి యుండరాదు.** "క్రీస్తు బోధయందు నిలిచియుండక దానిని విడచి ముందుకు సాగు ప్రతివాడును దేవుని అంగీకరింపనివాడు; ఆ బోధయందు నిలిచియుండువాడు తండ్రిని కుమారుని అంగీకరించువాడు. ఎవడైనను ఈ బోధను తేక మీ యొద్దకు వచ్చిన యెడల వానిని మీ యింట చేర్చుకొనవద్దు; శుభమని వానితో చెప్పవద్దు శుభమని వానితో చెప్పువాడు వాని దుష్టక్రియలలో పాలివాడగును" (2 యోహాను 9-11). "సహోదరులారా, మీరు నేర్చుకొనిన బోధకు వ్యతిరేకముగా భేదములను, ఆటంకములను కలుగజేయు వారిని కనిపెట్టి యుండుడని మిమ్మును బతిమాలు కొనుచున్నాను. వారిలో నుండి తొలగిపోవుడి. అట్టివారు మన ప్రభువైన క్రీస్తుకుకాక తమ కడుపునకే దాసులు; వారు ఇంపైన మాటలవలనను, ఇచ్చకములవలనను నిష్కపటుల మనస్సులను మోసపుచ్చుదురు" (రోమా 16:17,18).

**5. అన్యాత్యారాధనను జరిగించు వారితో మనము సహవాసము కలిగి యుండరాదు.** ఏథెన్సు ప్రజలకు పౌలు ఇట్లు చెప్పెను: "నేను సంచరించుచు మీ దేవతా ప్రతిమలను చూచుచుండగా ఒక బలిపీఠము నాకు కనబడెను. దానిమీద తెలియబడని దేవునికి అని వ్రాయబడి యున్నది. కాబట్టి మీరు తెలియక దేనియందు భక్తి కలిగియున్నారో దానినే

నేను మీకు ప్రచురపరచుచున్నాను" (అపొ.కా. 17:23). "మనుష్యులు కల్పించిన పద్ధతులు దైవోపదేశములని బోధించుచు వారు నన్ను వ్యర్థముగా ఆరాధించుచున్నారు" అని యేసు పలికెను (మత్తయి 15:9).

**6. అవనమ్మకముగా యున్న క్రైస్తవునితో మనము సహవాసము చేయరాదు.** అట్టివారిని సంఘ సహవాసము నుండి తొలగించవలెనని పౌలు చెప్పుచూ ఇట్లు వ్రాసెను: "ఇప్పుడైతే, సహోదరుడనబడిన వెవడైనను జారుడుగాగాని, లోభిగాని, విగ్రహారాధికుడుగాని, తిట్టుబోతుగాని, త్రాగుబోతుగాని, దోచుకొనువాడుగాని అయియున్న యెడల, అట్టి వానితో సాంగత్యము చేయకూడదు, భుజింపను కూడదని మీకు వ్రాయుచున్నాను" (1 కొరింథి 5:11). అట్టివానిని మనము అన్యునిగాను, సుంకరిగాను ఎంచవలెను.

పైన చెప్పబడినవారితోను, లేక దేవుని నెదిరించు వారితోను మనము సహవాసము చేయరాదు, అట్టివారిని మనము ప్రోత్సహించరాదు. వారిని గుర్తించుటగాని, అంగీకరించుటగాని, వారికి సహాయము చేయుటగాని కూడదు. వారిని సహోదరులు అని పిలువలేము, వారితో కలసి ఆరాధించలేము, వారి వాయిద్యములతో కలసి పాడలేము. వారు చేయుచున్న పనికి ఆర్థికముగా సహాయము చేయలేము. సరిగదా మనము వారిని ఎదిరించవలెను. వారిని గూర్చి యితరులను హెచ్చరించవలెను. వేరుగా యుండవలెని మన కోరిక కాదు, వారిని మనము ప్రేమించుట లేదనికాదు, మనము స్వనీతిపరులమని కాదు గాని మనమేమి చేసినను బైబిలును బట్టియే చేయువలెను. ఈ రీతిగ మనము ప్రజలకు సహాయపడుదుము. ముందుగా వారు దాని ప్రయోజనమును ఎరుగకపోవచ్చును గాని వారిని సహవాసము నుండి తొలగించుట వలన వారికి అన్నిటికంటె అది చివరకు ప్రయోజనకారి యగును. మనము వారితో సహవాసము చేయుచు యున్న యెడల వారి ప్రవర్తనను మనము సమర్థించిన వార మగుదుము. వారు తాము ఉన్న స్థితిలోనే యుందురు. అట్టి వారితో సత్యమును మనము పంచుకొనలేము.

సంఘము ప్రత్యేకమైన ప్రజలతో సమకూర్చబడినది. వారు రక్షింపబడినవారు, క్రీస్తు శరీరమైనవారు.

గనుక భూమిపై క్రీస్తును సూచించువారు. అందువలన ప్రతిదానిని వారు అంగీకరించలేరు. వారి చుట్టు జరుగుచున్న ప్రతిదానిని వారు సమ్మతింపలేరు. అసత్యమునకు వారు చేయూత నీయలేరు, దానికి శుభమని చెప్పలేరు. నరిగదా వారు లోకమునుండియు, క్రీస్తును సరిగ అనుసరించలేనివారి నుండియు తమ్మును తాము వేరుపరచుకొనవలెను. వారు విభజనలను తిరస్కరించి ఐక్యత కొరకు పనిచేయవలెను. వారు ప్రతిష్ఠింప బడినవారు, ప్రత్యేక పరచబడినవారు, వారు క్రైస్తవులు మాత్రమే. వారు దేవునితోను, క్రీస్తుతోను, ఆయన ప్రజలతోను మాత్రమే సహవాసము కలిగి యున్నావారు. బైబిలు బోధించునది అదే. ఈ క్రింది వాటిని దయచేసి గమనించుము :

**1. మనము దేవునితో సహవాసము కలిగి యుండవలెను.** "మాతో కూడ మీకును సహవాసము కలుగునట్లు మేము చూచిన దానిని, వినిన దానిని మీకును తెలియజేయుచున్నాము. మన సహవాసమయితే తండ్రితో కూడను, ఆయన కుమారుడైన యేసు క్రీస్తుతో కూడను ఉన్నది" (1 యోహాను 1:3; 1యోహాను 1:6ను కూడ చదువుము).

**2. మనము క్రీస్తుతో సహవాసము కలిగియుండవలెను.** "ఆయన మరణ విషయములో సమానానుభవము గలవాడనై, ఆయనను ఆయన పునరుత్థాన బలమును ఎరుగు నిమిత్తము, ఆయన శ్రమలలో పాలివాడనగుట యెట్టిదో యెరుగు నిమిత్తమును సమస్తమును నష్టపరుచుకొంటిని" యని పౌలు వ్రాసెను (ఫిలిప్పీ 3:10). "మన ప్రభువైన యేసుక్రీస్తు అను తన కుమారుని సహవాసమునకు మిమ్మును పిలిచిన దేవుడు నమ్మతగినవాడు" (1 కొరింథి 1:9).

**3. మనము ఆత్మతో సహవాసము కలిగియుండవలెను.** "కావున క్రీస్తునందు ఏ హెచ్చరికయైనను, ప్రేమవలన ఆదరణయైనను, ఆత్మయందు ఏ సహవాసమైనను, ఏ దయారసమైనను, వాత్సల్యమైనను ఉన్నయెడల మీరు ఏక మనస్కులగునట్లుగా ఏక ప్రేమ కలిగి, ఏకభావము గల వారుగా ఉండి, ఒక్కదాని యందే మనస్సుంచుచు నా సంతోషమును సంపూర్ణము చేయుడి" (ఫిలిప్పీ 2:1-2).

**4. నమ్మకముగానున్న క్రైస్తవులతో మనము సహవాసము కలిగి యుండవలెను.** "అయితే ఆయన వెలుగులో నున్న ప్రకారము మనమును వెలుగులో నడిచిన యెడల మనము అన్యోన్య సహవాసము గలవారమై యుందుము : అప్పుడు ఆయన కుమారుడైన యేసు రక్తము ప్రతి పాపము నుండి మనలను పవిత్రులనుగా చేయును" (1 యోహాను 1:7).

**5. ఆరాధనలో మనము సహవాసము కలిగి యుండవలెను.** "వారు అపొస్తలుల బోధయందును, సహవాసమందును, రొట్టె విరుచుటయందును. ప్రార్థనచేయుట యందును ఎడతెగక యుండిరి" (అపో.కా. 2:42). "కొందరు మానుకొను చున్నట్టుగా సమాజముగా కూడుట మానక, ఒకని నొకడు హెచ్చరించుచు, ఆ దినము సమీపించుట మీరు చూచిన కొలది మరి యెక్కువగా ఆలాగుచేయుచు, ప్రేమ చూపుటకు సత్కార్యములు చేయుటకును ఒకని నొకడు పురికొల్పవలెనని ఆలోచింతము" (హెబ్రీ 10:25).

**6. సువార్త ప్రకటించుటలో మనము సహవాసము కలిగి యుండవలెను.** "మొదటి దినమునుండి ఇదివరకు సువార్త విషయములో మీరు నాతో పాలివారై యుండుట చూచి, మీలో ఈ సత్ క్రియ నారంభించినవాడు యేసుక్రీస్తు దినము వరకు దానిని కొనసాగించునని రూఢిగా నమ్ముచున్నాను. గనుక మీ అందరి నిమత్తము నేను చేయు ప్రతి ప్రార్థనలో ఎల్లప్పుడు సంతోషముతో ప్రార్ధనచేయుచు, నేను మిమ్మును జ్ఞాపకము చేసికొనినప్పుడెల్ల కృతజ్ఞతాస్తుతులు చెల్లించుచున్నాను. నా బంధకముల యందును, నేను సువార్త పక్షమున వాదించుటయందును, దానిని స్థిరపరచుట యందును మీరందరు ఈ కృపలో నాతో కూడ పాలివారై యున్నారు గనుక నేను మిమ్మును నా హృదయములో ఉంచుకొని యున్నాను" (ఫిలిప్పీ 1: 3-7).

**7. పరిశుద్ధుల పరిచర్యలో మనము సహవాసము కలిగియుండవలెను.** "ఈ కృప విషయములోను, పరిశుద్ధుల కొరకైన పరిచర్యలోను పాలుపొందు విషయములోను మనఃపూర్వకముగా మమ్మును వేడుకొనుచు వారు తమ సామర్థ్యము కొలదియేగాక

సామర్ధ్యముకంటె ఎక్కువగాను తమంతట తామే యిచ్చిరని మీకు సాక్ష్యమిచ్చు చున్నాను (2 కొరింధి 8: 3-4).

**8. ప్రతి సత్కార్యములోను మనము సహవాసము కలిగి యుండవలెను.**

"ఎవడైనను వీటిలో చేరక తన్ను తాను పవిత్రపరచుకొనిన యెడల వాడు పరిశుద్ధపరచబడి యజమానుడు వాడుకొనుటకు అర్హమై ప్రతి సత్కార్యమునకు సిద్ధపరచబడి ఘనత నిమిత్తమైన పాత్రయై యుండును" (2 తిమోతి 2:21).

క్రీస్తు సంఘ సభ్యుడైన ప్రతివాడును దేనితో సహవాసము చేయవలెనో, దేనితో సహవాసము చేయకూడదతో ఎరిగి యుండవలెను. సహవాసము చేయగలిగిన దానిని అతడు చేయూతనిచ్చి ప్రోత్సహించవలెను. అంటే అతడు ఆర్ధిక సహాయము నిచ్చుచు, సహోదరులతో కలసి పనిచేయుచు, తన పూర్తి సహకారము నీయవలెను. సహోదరుల సహవాసము నుండి కలుగు ప్రోత్సాహముకన్న మిన్న అయినది వేరొకటి లేదు. సహోదరులతో సహవాసము కలిగియుండుటలోను, సత్కార్యమును జరిగించుటలోను వారి ప్రోత్సాహము ఎంతో మేలుకరముగా యుండును, దేవుని బిడ్డలకంటె సన్నిహితులైన ప్రజలు మరొకరు లేరు. "మనందరినీ కలిపిన ప్రేమ బంధము ఎంతో ధన్యమైనది".

– జె.సి.ఛోట్

సత్యవాణి - క్రీస్తు సంఘము ద్వారా ఉచితంగా ఇయ్యబడుచు: బైబిలు కరస్పాండెన్సు కోర్సులో మీరు, మీ సంఘ సభ్యులు చేరండి. ఆ పాఠములను మీ యింటిలోనే పూర్తిచేసి బైబిలు జ్ఞానమును పొందండి. ఈ రోజే మాకు వ్రాయండి.

SATYAVANI, P.O.Box-80, KAKINADA - 533 001.

గమనిక : సత్యవాక్కు కావలసిన వారు సంవత్సరమునకు 50/-రూ॥లు చందా విధిగా పంపించవలయును.

# విమోచింపబడిన వారు, దేవుని ఉగ్రత
## (The Redeemed and the Wrath of God)

**పరిచయం:** ప్రకటన గ్రంథం 12 నుండి 14 అధ్యాయముల వరకు దేవుని ప్రజలు ఎదుర్కొను పోరాటమును గూర్చి చెప్పబడినది. క్రీస్తుకును, సాతానుకును తెరవెనుక జరుగుచున్న గొప్ప పోరాట ఫలితమది. క్రీస్తును నాశనం చేయుటలో సాతాను విఫలమయ్యాడు గనుక వాడు ఆయన ప్రజలను నాశనం చేయ జూచుచున్నాడు.

అతడు సముద్ర మృగమునకు సాదృశ్యమైన హింసాజనక ప్రభుత్వములను, భూ మృగమును పోలియున్న అబద్ధ మతములను (మత శాఖలను), బబులోనుకు సాదృశ్యమైన ఈ లోక సంబంధమైన దురాశలను ఉపయోగించి దేవుని ప్రజలను నాశనమునకు ఈడ్చుకొని పోవుటకు ప్రయత్నించును. గాని దేవుని చేముద్రింప బడినవారు సురక్షితులై అంతిమ కోతలో ఆయన యొద్దకు చేర్చబడుదురు.

ప్రకట గ్రంధములో ఆఫ్ఘనిస్థాన్, ఇరాన్, ఇరాక్, ఇశ్రాయేల్, ఈజిప్టు మొదలగు దేశాలను గూర్చిగాని, అరబ్బులను గూర్చిగాని యేమీ నేర్చుకొనము. దేవతార్చనచేయు దేశ ప్రభుత్వములు వాటి స్వల్ప రాజకీయములను గూర్చిగాక ఒక గొప్ప ఆత్మీయ పోరాటమును, దానిలో విజయాన్ని గూర్చి నేర్చుకొందుము.

☞ ఇప్పుడు ప్రకటన 15వ అధ్యాయమును చదువుము.

**ప్రకటన** 15:1-4 :

☞ యోహాను ఆశ్చర్యకరమైన గొప్ప సూచనను పరలోకములో చూచెను.

☞ ఏడు తెగుళ్లు చేత పట్టుకొనియున్న యేడుగురు దూతలను అతడు చూచెను. ఇవే కడవరి తెగుళ్లు.

☞ ప్రకటన 12:1-3లో అతడు ప్రకాశమానమైన ఒకస్త్రీని ఆమె శిశువును చూచెను. మరియు గొప్ప క్రూరమృగమును అనగా సాతానును చూచెను.

☞ ఇప్పుడు దేవుని ఉగ్రతను బయలు

పర్చు సూచనను, విమోచింపబడిన వారిని అతడు చూచెను.

☞ఏడు తెగుళ్ళ చేత పట్టుకొని యున్న ఏడుగురు దూతలు. ప్రకటన 9:20, 11:6లో తెగుళ్లను గూర్చి చెప్పబడెను. యివి దేవుని తీర్పులకు సాదృశ్యము.

☞తరువాత అగ్నితో కలిసియున్న స్పటికపు సముద్రము వంటిదానినతడు చూచెను.

☞విమోచింపబడిన వారు అగ్నివంటి మహాశ్రమలను (సముద్రమును) జయించి విమోచన కర్త యొక్క సన్నిధికి చేరుకొందురు.

☞ఇశ్రాయేలీయులు ఎర్ర సముద్రమును దాటి విమోచింపబడిన వారై మోషే కీర్తనను, దేవునికి స్తుతిగానములను చేయుట ఇక్కడ మనకు గుర్తు వచ్చుచున్నది (నిర్గమ 15:1-18).

☞అవవాదిని జయించిన వారు విజయగీతములు పాడుచు దేవుని సన్నిధిని నిలుతురు.

☞ప్రకటన 13:4లో ఈలోక ప్రజలు చావుదెబ్బ మానిపోయిన ఘటసర్పమునకు నమస్కారము చేయుచు దానితో సాటియైనవాడెవడు? దానితో యుద్ధము చేయగలవాడెవడు? అని చెప్పుకొనుచుండిరి.

☞గాని ఇప్పుడు హింసించు ప్రభుత్వములను శక్తులను జయించి దేవుని ప్రజలు ప్రభువా, దేవా సర్వాధికారీ నీ క్రియలు ఆశ్చర్యమైనవి, ఘనమైనవి, నీ మార్గములు న్యాయములును సత్యములునైయున్నవి, నీవు పవిత్రుడవు నీకు భయపడనివాడెవడు? నీ నామమును మహిమపరచని వాడెవడు? అని చెప్పుచు మోషే కీర్తనయు గొర్రెపిల్ల కీర్తనయు పాడుచుండిరి.

☞అవును దేవుడు మానవులను పాలించు చున్నారు. సమస్తము ఆయన కంట్రోలులో యున్నది. ఈలోకాధికారములు నాశనమగును గాని దేవుడు ఆయన ప్రజలు విజేయులగుదురు.

☞అందువలన దేవుని క్రియలు ఘనమైనవి, ఆశ్చర్యమైనవి (కీర్తన 92:5; 111:2).

☞ఆయన మార్గములు న్యాయములు, సత్యములు (కీర్త 145:1)

☞నీకు భయపడని వాడెవడు? (కీర్త 86:9).

☞నీవు మాత్రము పవిత్రుడవు (కీర్త 86:9).

**ప్రకటన** 15:5-8 :

☞యోహాను సాక్ష్యపు గుడార సంబంధమైన ఆలయమును పరలోకమందు చూచెను.

☞పరలోకంలో నిజమైన దేవాలయం యేదీవుండదు (ప్రక 21:22).

☞ఇక్కడ వున్న 'ఆలయము' దేవుని నివాస స్థానము.

☞ఏడు తెగుళ్లతో ఏడుగురు దూతలు దాని నుండి వెలపలికి వచ్చిరి.

☞వారు పాతనిబంధనలో యాజకులు ధరించుకొన్న వస్త్రములను ధరించియుండిరి. అవి రాజవస్త్రములు కావచ్చును.

☞వారికి దేవుని కోపముతో నిండి యున్న యేడు బంగారు పాత్రలు ఇయ్యబడెను. ప్రకటన 5:8 ప్రకారము యివి పరిశుద్ధుల ప్రార్ధనలు !

☞పరిశుద్ధుల ప్రార్ధనలను బట్టి పరలోకము స్పందించుట ప్రకటన 8:3లో చదువగలము.

☞అప్పుడేమి జరిగెను? "అంతట దేవుని మహిమనుండియు ఆయన శక్తి నుండియు వచ్చిన పొగతో ఆలయము నింపబడిందున ఆ యేడుగురు దూతల యొద్ద ఉన్న యేడు తెగుళ్లు సమాప్తియగు వరకు ఆలయమందు ఎవడు ప్రవేశింప జాలకపోయెను".

☞ అనగా ఇక ప్రార్ధన లేమి వినబడజాలవు. మారుమనస్సు పొందే సమయమిక లేదు. రోమా సామ్రాజ్యముపై దేవుని ఉగ్రత కుమ్మరింపబడుటకు అదే సమయం! మారుమనస్సు పొందని మానవులపై దేవుడు తన ఉగ్రతను కుమ్మరించుటకు సంసిద్ధుడై యున్నారు.

**ముగింపు** : "మనము సత్యమును గూర్చిన అనుభవ జ్ఞానము పొందిన తురువాత బుద్ధిపూర్వకముగా పాపము చేసిన యెడల పాపములకు బలియికను ఉండదు గాని న్యాయ తీర్పునకు భయముతో ఎదురు చూచుటయు విరోధులను దహింపబోవు తీక్షణమైన అగ్నియు ఇకను ఉండును" (హెబ్రీ 10: 2-27).

**సత్యవాణి** రేడియో, TV కార్యక్రమములలో మీరు వినుచున్న మధుర క్రైస్తవ భక్తిగీతములు 4 CD లలో లభించుచున్నవి. అవి కావాలంటే 160/- రూ॥లు m.o. ద్వారా సత్యవాణి ఆఫీసుకు పంపండి.

# కానానును జయించుట

ముందు పాఠమున ఇశ్రాయేలు ప్రజలు యోర్దానునకు తూర్పు భాగమున వాగ్ధానభూమిలో ప్రవేశించుటకు సిద్ధముగా ఉండుట చూచితిమి. మోషే చనిపోయిన తరువాత యెహోషువాకు వారిని నడిపించుటకును, కానానును జయించి దానిని స్వతంత్రించుటకును అధికార మియ్యబడెను. ఈ జయించు కార్యక్రమ మంతయు యెహోషువా గ్రంధము నందు వ్రాయబడినది. ఇందు 3 భాగములు కలవు.

1. కానాను జయించుట అధ్యాయములు 1-12 వరకు.
2. భూమిని ఇశ్రాయేలీయుల గోత్రముల ననుసరించి పంచుకొనుట 13 నుండి 22 అధ్యాయముల వరకు.
3. యెహోషువా వీడ్కోలు 23-24 అధ్యాయములు-గూఢ చారులు అనుకూలముగా చెప్పుట వలన దేవుడు శత్రువులను వారిచేతికి అప్పగించునని వారు నమ్మిరి. వారు వరదతో పరవళ్ళు త్రొక్కుతున్న యోర్దాను నదిని దాటుటకు దేవుని యందలి ధైర్యముతో ముందుకు నడిచిరి. బహుషా దేవుడు వారు ఎర్ర సముద్రమును దాటించుట 40 సం॥లు అరణ్యములో ఆశ్చర్యముగా నడిపించుట వారికి ధైర్యము తెచ్చెను. మరల దేవుడు ఎర్ర సముద్రమును పాయలు చేసినట్లు యోర్దానును కూడ పాయలుగా చీల్చి రెండవసారి అదే అద్భుత కార్యమును చేసెను. వారు ఆరిన నేలమీద నడిచి యోర్దాను నది దాటిరి. నది దాటిన తర్వాత 2 బలిపీఠములను ఒక్కొక్కటి 12 రాళ్ళతో ఒకటి నది గర్భములోను రెండవది నది దాటిన తర్వాత ఆరిన నేలపైని కట్టిరి. ఇది యోర్దాను పశ్చిమ తీరమున ఉన్నది.

యెరికో కూల్చుటకు ముందు దానిచుట్టు 7 రోజులు 7సార్లు తిరుగవలయునని దేవుడు వారికాజ్ఞాపించెను. గోడలు కూలిన పట్టణము జయించబడినది. ప్రస్తుత కాలపు పురావస్తు పరిశోధన శాస్త్రజ్ఞులు అద్భుతమైన ఈకార్యమును పరిశోధించి కనుగొని ఆశ్చర్య పోయిరి. గోడలు

వెలుపలి భాగమునకు అనగా కొండలోయలోనికి ఎవరో పట్టణములో నుండి పడగొట్టినట్లుగా పడిపోవుట శాస్త్రజ్ఞులు కనుగొని బైబిలు యొక్క యదార్థతను బుజువు పరచిరి. తరువాత కూల్చవలసిన పట్టణము "హాయి" ఇది యెరికో కంటే చిన్నది. కాని యెహోషువ అతని సైన్యము ఆకాను అను ఇశ్రాయేలీయుడు చేసిన పాపము వలన హాయి పట్టణము వారిచే తరుమబడిరి. తనది కాని వేరొకటి తీసుకొనుట వలన ఈ దురవస్థను అతడు దేవునికి ప్రజల మీదకు తెచ్చెను. యోహోషువ (7). దేవుడు తన ప్రజల మధ్య పాపమును సహించడనుటకు ఇది ఒక ప్రత్యక్ష నిదర్శనము. ఆకానుకు మరణ శిక్ష విధించిన తర్వాత "హాయి" పట్టణమును వారు సులువుగా జయించిరి. ఈ దృశ్యమును చూచి పొరుగు రాజ్యము వారైన గిబ్యోను వారు ఇశ్రాయేలీయులతో సంధి చేసికొనిరి. ఇందువలన చుట్టుప్రక్కల ఉన్న ఐదుగురు అమోరీయ రాజులు గిబియోను ఇశ్రాయేలీయులు ఒక వైపున, అమోరీయుల 5 గురు రాజులు ఒక వైపున ఉండి యుద్ధము చేయుట ప్రపంచములోని చారిత్రాత్మకమైన యుద్ధములలో ఒకటి.

దేవుడు తన ప్రజలు విజయము పొందునట్లు సూర్యచంద్ర గమనములను ఆపివేసెను. శత్రువులు సంపూర్ణముగా నాశనమై కానానును జయించుటకు నరాళమైన మార్గము ఏర్పడెను. (యెహోషువా 10 అధ్యాయము). ఈ యుద్ధమునందు 31 రాజులును జయించి ఇశ్రాయేలీయులు కానానును వశపరచుకొనిరి. తరువాత భాగములను విభజించి వాటిని పొందుటకు చీట్లను వేసిరి. యోర్దానునకు తూర్పున ఉన్న ప్రాంతమునుగాదు,రూబేను, మనష్షే అర్ధగోత్రమున కిచ్చిరి. లేవీయులకు 48 పట్టణములు ఇచ్చిరి. ఎవరైనా చంపిన యెడల వారు తలదాచుకొనుటకు 6 ఆశ్రయపురములను ఏర్పాటుచేసిరి. 85 సం॥ల వయస్సు గల కాలేబు 12 మంది గూఢచారులలో ఒకడు. అతనికి ప్రత్యేకమైన బహూమానముగా కొంత భూమిని ఇచ్చిరి. ప్రత్యక్ష గుడారము కొరకు షీలోహునందు కొంత భూమిని ఇచ్చిరి. ప్రత్యక్ష గుడారము షీలోహునందు ఉంచబడినది. అచ్చటనే అది కొన్ని వందల సం॥లు ఉండెను. ప్రజలు వాగ్దాన భూమిని స్వతంత్రించుకొని స్థిరపడిన తర్వాత యెహోషువ వారిని షెకెమునకు పిలిచి

ఆఖరి హెచ్చరిక చేసెను. ఈ హెచ్చరిక దేవుని యందు విశ్వాసముతో ఉండవలయుననియు, (యెహోషువా 24:15) యెహోవాను సేవించుట మీ దృష్టికి కీడని తోచిన యెడల మీరు ఎవనిని సేవించెదరో అది ఈనాడే నిర్ణయించుకొనుడి. కానీ నేను, నాయింటి వారును యెహోవాను సేవించెదము అని చెప్పెను. ఆలాగు ప్రజలను హెచ్చరించి యెహోషువా తన 110వ యేట చనిపోయెను.

## న్యాయాధిపతులు

యెహోషువా చనిపోయిన తర్వాత ఏవిధమైన పరిపాలన క్రమములేకుండా ఇశ్రాయేలీయులు విడిచి పెట్టబడిరి. కానాను జయించుటలో ఐకమత్యము కలిగి యుండినటువంటి ఇశ్రాయేలీయుల 12 గోత్రములు ఇప్పుడు ఎవరి దారిన వారు పోసాగిరి. వాగ్దాన భూమిని సంతరించుకొనిన తర్వాత 300 సం॥ల కాలములో 7 మారులు దేవునిని విడచి విగ్రహారాధన వైపు తిరిగిరి, వారికి పశ్చాత్తపము కలుగునట్లు 7 మార్లు యెహోవా దేవుడు వారిపైకి విదేశీయులను పంపించి బుద్ధి చెప్పించెను. 7 సార్లు వారికి 7 గురు న్యాయాధిపతులను అనుగ్రహించి వారి ద్వారా విడిపించెను. వీరికి కాపరులుగా ఉండు అధికారులను దేవుడు న్యాయాధిపతులుగా అనుగ్రహించెనే గాని రాజులుగా కాదు. దేవుడు వారికి 15 మంది న్యాయాధిపతులను అనుగ్రహించెను. ఈ న్యాయాధిపతులు ప్రజలను విపత్తుకాలమందు రక్షించి నడిపించుటకు అనుగ్రహించబడిరి. ఇదియుకాక ప్రజలలో ఉన్న ఇశ్రాయేలీయులలో కొంత భాగమునే పరిపాలించిరి. కొన్ని సం॥లందు అసలు న్యాయాధిపతులు 17:6లో వ్రాసినట్లు ప్రతి మనుష్యుడు తన ఇష్టానుసారముగా ప్రవర్తించుచు వచ్చెరి.

ఇశ్రాయేలీయులు అతి తరచుగా దేవుని ఎందుకు విసర్జించుచు వచ్చిరి? ఈలాగు చేయుటకు చాలా కారణములు గలవు.

1. వారి చుట్టు నున్న ప్రజలు విగ్రహారాధికులు కనుక వారు పొరుగువారు ఉండినట్లుగా ఉండుటకు ఇష్టపడిరి.

2. కానాను జయించినటువంటి తరమువారు నశించిపోయిరి. కనుక తరువాత తరమువారు దేవుడు వారి

పితరులను ఏలాగు విమోచించెనో తెలిసికొనలేకపోయిరి.

3. ఇశ్రాయేలీయులలో మోషే యెహోషువాల వంటివారు తరువాత రానందున యెహోవాకు విశ్వాసులుగా ఉండలేక పోయిరి. ప్రతివాడు తన దృష్టికి మంచిదైనది చేయుటవలన తనను తాను సంతోష పెట్టుకొనుటలో దేవుని సంతోష పెట్టుట మరచిపోయిరి వారు శిక్షించబడినప్పుడు తప్ప వారు శిక్ష పొందినప్పుడే దేవునికి మొఱ్ఱ పెట్టుచుండరి. కానీ శిక్ష లేనప్పుడు దేవునిని మరచిపోవుచుండిరి. న్యాయాధిపతుల వృత్తాంతములద్వారా మారుమనస్సున కర్ధమును గ్రహించగలము. ఇశ్రాయేలీయులు పాపము చేసినప్పుడల్లావారు మారుమనస్సు పొందునట్లు దేవుడు వారిని శిక్షించుచు వచ్చెను. అందువలన వారు పశ్చాత్తాపులైతద్వారా కలిగిన దుఃఖము వలన వారి మార్గములను మలుచుకొను చుండెడివారు. కేవలము దఃఖించుట వలన మారుమనస్సు రాదు కానీ 2కొరింథీ 7:10లో చెప్పినట్లు దైవచిత్తానుసారమైన దుఃఖము రక్షణార్ధమైన మారుమనస్సును కలుగజేయును. మారుమనస్సు అనగా హృదయ పరివర్తన, దాని ద్వారా జీవితము మార్పు చెందును.

కొందరి న్యాయాధిపతులను గురించి ఏమియు చెప్పబడలేదు. ఇంకా కొద్దిమంది గూర్చి కొద్దిగా చెప్పబడింది. బారాకుతో కలిపి న్యాయాధిపతిగా ఉన్న ఏకైక స్త్రీ "దెబోరా" (న్యాయాధిపతులు 4:5). గిద్యోను తన 300 మంది సేనతో మిద్యాను సేనను పూర్తిగా జయించెను. న్యాయాధిపతులు 7. న్యాయాధిపతులలో గొప్పవారిలో ఒకరు ఎఫ్తా. ఇతడు చాలా అవివేకమైన వాగ్దానము దేవునికి చేసినందున తనయొక్క కుమార్తెను బలిగా అర్పించవలసి వచ్చెను. (న్యాయాధిపతులు 11). మనందరికి తెలిసిన వృత్తాంతము సంసోను. ఈయన మహా బలశాలి. ఆయన మహాబలముతో ఫిలిష్తీయులను ఒక్కడే ఓడించుటకు ప్రయత్నించెను (న్యాయాధిపతులు 14-16). ఆఖరి వాడును, అందరికంటే గొప్పవాడును అయిన సమూయేలు, దేవుని యొక్క వాగ్దానము ద్వారా తన తల్లియైన హన్నాకు జన్మించి దైవసేవకుచిన్న తనముననే వాగ్దానము చేయబడెను. ఆయన ఇశ్రాయేలీయుల నందరిని సంఘటితపరచి వారందరు ఐక్యమగునట్లు కృషిచేసెను. ఈ

న్యాయాధిపతుల కాలమును గూర్చి తెలియుటకు న్యాయాధిపతుల గ్రంధమును చదువుము.

### రూతు

రూతు పుస్తకము నందలి సంగతులు గ్రహించకుండా న్యాయాధిపతుల వృత్తాంతము పూర్తియగుట కష్టము. చాలమంది రూతు గ్రంధమును గొప్ప ప్రేమ కధ అని చెప్పుదురు. ఇందు రూతు అను యౌవనవంతురాలైన మోయాబీయురాలు తన స్వంత ప్రజలను, విడిచి ఇశ్రాయేలు దేశమునకు వెళ్ళుటను చూడగలము. ఈమె బోయజు అను ధనవంతుని కలుసుకొని ఆయనను వివాహమాడి, దావీదునకు ముత్త వ్వయాయెను. ఈ దావీదు ద్వారానే లోకరక్షకుడైన క్రీస్తు వెలసెను, ఒక అన్యురాలు రక్షకుని వంశావళిలో ఉండుట ఎంత ఆశ్చర్యకరము! రూతు గ్రంధము చదువుము, చాలా చిన్న పుస్తకము నీవు దీనిని చదివిన ఎంతో ఆనందించగలవు.

# పైనున్న వాటిని వెదుకుడి

## Seek those things which are above

మన జీవితంలో దేనిని గూర్చి ప్రాధాన్యత మనమీయాలో బైబిలు మనకు తెలియజేయుచున్నది. బైబిలు బోధను మరచి మనం కొన్నిసార్లు స్వల్ప విషయాలపై మన దృష్టి కేంద్రీకరించుచున్నాము.

కొలస్స 3:1-4లో ఈలాగు వ్రాయబడియున్నది: "మీరు క్రీస్తుతో కూడ లేపబడిన వారైతే పైనున్న వాటినే వెదకుడి, అక్కడ క్రీస్తు దేవుని కుడిపార్శ్వమున కూర్చుండి యున్నాడు. పైనున్న వాటి మీదనే గాని భూసంబంధమైన వాటి మీద మనస్సు పెట్టుకొనకుడి; ఏలయనగా మీరు మృతి పొందితిరి, మీ జీవము క్రీస్తుతో కూడ దేవుని యందు దాచబడి యున్నది. మనకు జీవమైయున్న క్రీస్తు ప్రత్యక్షమైనప్పుడు మీరును ఆయనతో కూడ మహిమయందు ప్రత్యక్షపరచబడుదురు".

"కాబట్టి మీరు ఆయన రాజ్యమును నీతిని మొదట వెదకుడి; అప్పుడవన్నియు మీకు అనుగ్రహింపబడును" అని యేసు బోధించారు (మత్తయి 6:33). మానవుడు ఈ లోకంలో వెదకు సంగతులను గూర్చి చెబుతు వారు మొదట దేవునిని, ఆయన రాజ్యమైన నంఘమును వెదకాలని ఆయన చెప్పారు. మనం భౌతిక విషయాలకు గాక ఆత్మీయ సంగతులకు ప్రాధాన్యత నియ్యాలని ఆయన చెప్పారు. "ఎవడును ఇద్దరు యజమానులకు దాసుడుగా నుండనేరదు; అతడు ఒకని ద్వేషించి ఒకని ప్రేమించును, లేదా యొకని వక్షముగా నుండి యొకని తృణీకరించును. మీరు దేవునికిని సిరికిని దాసులుగా యుండనేరరు" అని ఆయన బోధించారు (మత్తయి 6:24).

పైనున్న వాటికి మనం ప్రాధాన్యత నిచ్చుటకు నేర్చుకోవాలి. అంటే వేరే విషయాలను గూర్చి పట్టించుకోకూడదని అర్థం కాదు. మిగతా సంగతులు కూడ ప్రాముఖ్యమే. మన జీవనోపాధి కొరకు, కటుంబ పోషణ కొరకు మనం ఉద్యోగం చేయాలి. మనం క్రీస్తుకే ప్రాధాన్యత యిస్తే మిగతా సంగతుల విషయం ఆయన కోణంలో ఆలోచిస్తాము. మనం పైనున్న వాటినే వెదకితే మన ఉద్యోగం, వృత్తి గృహం, సంపద మొదలగునవి దేవునికి ఉన్నత పరిచర్య చేయుటకుఉపకరిస్తాయి.

కొలన్స 3:5లో మనం కొన్ని సంగతులను చంపి వేయాలని పౌలు చెప్పుచున్నాడు. "కావున భూసంబంధమైన మీ అవయవములను అనగా జారత్వరమును, అపవిత్రతను, దురాశను, విగ్రహారాధనయైన ధనాపేక్షను చంపివేయుడి". భూసంబంధ గమ్యముల నెంచుకొనుట వలన యివి సంభవించును.

మరణ పర్యంతము ఆయనకు నమ్మకముగా జీవించిన యెడల మనకు నిత్య జీవితం వాగ్దానం చేయబడింది. ఈ లోకంలో దీర్ఘ కాలం జీవించడానికి మానవులు ఎంతో డబ్బును ఖర్చుపెట్టుచున్నారు. అయితే నిత్య జీవిత నిరీక్షణను క్రీస్తు వారు మనకు సాధ్యం చేసి యిచ్చారు (యోహాను 3:16). దాని పొందాలంటే మన జీవితంలో ఆయనకు ప్రధమస్థానం యివ్వాలి.

– వేయిన్ బేరియర్

# సంక్షిప్త వార్తలు

2008 ఫిబ్రవరి 8వ తేదీ శుక్రవారం పాయకరావు పేట మండలం నామవరంలో జరిగిన సువార్త కూటములో రిక్కీగూటంగారు వాక్య పరిచర్య చేసిరి. అక్కడ గోగాడ యోహానుగారు సువార్త పనిచేయుచున్నారు.

ఫిబ్రవరి 16వ తేదీ శనివారం ఖమ్మం పట్టణంలో జరిగిన సువార్తికుల సదస్సులో రిక్కీగూటంగారు వాక్య పరిచర్య చేసిరి ఖమ్మం ప్రాంతంలో ఉన్న అనేక మంది సువార్తికులు హాజరయ్యిరి. ఖమ్మంలో బ్రదర్ ఆనందరావుగారు, ప్రసాద్‌గార్లు దేవుని కొరకు మంచిపని చేయుచున్నారు. అదే రోజు సాయంకాలం 6 గంటలకు నేలకొండపల్లి మండలం చెరుమాదారంలో రిక్కీగారు వాక్యపరిచర్య చేసిరి. అక్కడ ఎ.గురుస్వామిగారు సతీసమేతముగా ఒక సంవత్సరము క్రితము క్రీస్తులోనికి బాప్తిస్మము పొందిరి. ఆ ఫలితముగా ఇంకొక 50 మంది హైందవులు క్రీస్తులోనికి చేర్చబడిరి. వీరితో బ్రదర్ సొలోమోను రాజుగారు కష్టించి పనిచేయుచున్నారు. వీరందరూ సత్యవాణీ టి.వి.కార్యక్రమములను శ్రద్ధగా వీక్షించుచూ సత్యమును గ్రహించు కొనుచూయున్నారు.

ఫిబ్రవరి 20వ తేదీ బుధవారం ముమ్మిడివరం మండలం గున్నేపల్లి గ్రామంలో సువార్తికుల సదస్సు జరిగెను. క్రైస్తవారాధనలో వాయిద్యములను వినియోగించ వచ్చునా అనే అంశం చర్చించబడినది. డి.ఇశ్రాయేలురాజు, వి.చిన్నయ్య, ఎ. గోపాల్‌గార్లు, రిక్కీగూటంగారు ఈ అంశమును సవిస్తరముగా లేఖనముల నుండి ఉపదేశించిరి. క్రైస్తవారాధనలో వాయిద్యములను ఉపయోగించుట లేఖనముల విరుద్ధమని ప్రకటించిరి.

ఫిబ్రవరి 29వ తేదీ శుక్రవారం రామచంద్రపురం మండలం ఓదూరుల్ జరుగుచున్న బైబిలు తరగతులలో సోదరులు జాషువాగూటంగారు ఉదయకాల సమావేశంలో వాక్యోపదేశం చేసిరి. ఓదూరు క్రీస్తు సంఘు అధ్వర్యమున మూడు దినములు అక్కడ బైబిలు తరగతులు జరిగెను. హాజరైన వారందరికీ భోజన సౌకర్యములు కల్పించిరి. ఓదూరులో సోదరుల పులగల సుందరరావుగారు సతీసమేతముగా క్రీస్తు కొరకు కష్టించి పనిచేయుచున్నారు. ఫిబ్రవరి 29 నుండి మార్చి 3 వరకు శ్రీకాకుళం, శ్రీకూర్మం, పాలకొండ, టెక్కలి పట్టణాలలోనూ, పరిసర ప్రాంతములలోనూ, జరిగిన సువార్త కూటములలో బ్రదర్ రిక్కీగూటంగారు వాక్య పరిచర్య చేసిరి. సహోదరులు ఆర్.సి.హెచ్.

జరిగించబడెను. శ్రీకాకుళం జిల్లాలో సోదరులు సద్గుణరావుగారు, బలమైన పనిచేయుచున్నారు. ఈ కూటములలో బ్రదర్ కె. అప్పారావుగారు తన ఆర్థిక చేయూతనిచ్చి ఎంతగానో సహాయపడిరి. ఐదుగురు క్రీస్తులోనికి బాప్తిస్మము పొందిరి.

2008 మార్చి 3వ తేదీ సోమవారం బిక్కవోలు మండలం ఇళ్ళపల్లిలో నిర్మించబడిన క్రీస్తుసంఘ ఆవరణము సోదరి కబితాగూటం గారును, ఆలయమును సోదరులు జాషువాగూటంగారును రిబ్బను కత్తిరించి దేవునికి ప్రతిష్టించిరి. తదుపరి జరిగిన సువార్త కూటములో జాషువాగారు వాక్య పరిచర్య చేసిరి. ఎమ్. సూర్యారావు (పెదపూడి), వి. రాజకూమార్ (అమలాపురం) సి. హెచ్.సుగుణరావు (దొంతమూరు), జి.యిడి. కుమార్ (ధవళేశ్వరం) ఎన్. డేవిడ్ కింగ్ (పాలచర్ల) గార్లు స్థానిక క్రీస్తు సంఘమునకు, స్థానిక ప్రీచర్ శ్రీనివాస్ గోగుల్ జీ గార్లకు తమ అభినందనలు తెలియ జేసిరి. సభకు డి.వి.ఆర్ బాలుగారు అధ్యక్షత వహించిరి. ఇళ్ళపల్లిలో బ్రదర్ గోగుల్ జీగారు, సతీసమేతముగా ఉద్యోగము చేస్తూ తమ సమయాన్ని, ధనాన్ని, వెచ్చించి క్రీస్తు కొరకు మంచి పని చేయుచున్నారు.

2008 నవంబరు, డిశంబరులలో జరుగబోవుచున్న ఏషియన్ బైబిల్ లెక్చరుషిప్ కొరకు మీరందరూ ప్రార్థించ మనవి.

RNI Regd. No. 6997/98
Postal Regd. No. AP/KD-02/2006-2008

To

From:

SATYA VAKKU

**P.O. Box 80, Kakinada - 533 001**

Edited & Published by Joshua Gootam Printed by him at Satya Vani Publication, Sambhamurthy St. Kakinada - 533 004